## క్లుప్తంగా

### సామూహిక వ్రతం


వ్రతం నిర్వహిస్తున్న అర్చకులు

జూలూరుపాడు: మండలంలోని శ్రీ రుక్మిణీ సహిత సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శనివారం శ్రీ సత్యనారాయణ స్వామి సామూహిక వ్రత పూజలు నిర్వహించారు. పూజారులు సత్యనారాయణ చార్యులు, వేణుగోపాలాచార్యులు దంపతుల చేత వ్రతాన్ని జరిపించారు. ఈ కార్యక్రమంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంస్థ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, సభ్యులు రమాదేవి, గోగులు వెంకటేశ్వర్లు, సున్నం ప్రసాద్, వెంకటప్పయ్య, ఆలయ కమిటీ చైర్మన్ అల్లాడి నరసింహారావు, సభ్యులు మిర్యాల రమేష్, రాచబంటి వెంకటనర్సయ్య, సొబ్బని కోటేశ్వరరావు దంపతులు పాల్గొన్నారు.

### అధికార సంఘం ఎన్నికల్లో ప్రాంతీయ వాదం సరికాదు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలోని అధికారులంతా కలిసి ఉంటున్న తరుణాన ఇతర రాష్ట్రాల వ్యక్తులు అనే భావం తలెత్తడం సరికాదని సీఎంఓఏఐ మాజీ అధ్యక్షుడు గడిపెల్లి కృష్ణ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత నెలలో సింగరేణి కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ (సీఎంఓఏఐ) ఎన్నికలు జరగగా, ప్రధాన కార్యాలయ అధ్యక్ష పదవికి దిలీప్‌కు ప్రత్యర్థి కంటే ఒక ఓటు ఎక్కువ వచ్చినా రీపోలింగ్‌కు నిర్ణయించారని తెలిపారు. కాగా, దిలీప్ స్వస్థలం బీహార్ అంటూ పేర్కొనడం సరికాదని, లాంగ్‌స్టాండింగ్ విషయానికొస్తే సింగరేణి భవన్‌లోనే చాలామంది ఉన్నారని చెప్పారు. ఈ మేరకు అధికారులు ప్రాంతీయ తత్వాన్ని ప్రదర్శించకుండా రీపోలింగ్‌లోనైనా పారదర్శకత పాటించి ఓట్లు వేయాలని కోరారు.

### 'అనుబోస్'లో క్యాంపస్ ప్లేస్‌మెంట్లు

పాల్వంచ: స్థానిక అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ డిజిటల్ ట్రస్ట్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో శనివారం క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ విద్యార్థులకు ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించారు. 50 మంది అర్హత సాధించారు. అనంతరం సంస్థ హెచ్‌ఆర్ శాంతి ప్రియదర్శి మాట్లాడుతూ.. ఎంపికైన అభ్యర్థులకు మార్చి 2న ఇంటర్వ్యూ నిర్వహిస్తామన్నారు. ప్లేస్‌మెంట్ సాధించిన వారికి వార్షిక జీతం రూ.5లక్షలు ఉంటుందని చెప్పారు. కళాశాల చైర్మన్ టి.భరత్ కృష్ణ, డైరెక్టర్లు డాక్టర్ టి.ఆవని, ప్రిన్సిపాల్ డాక్టర్ రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ జి.వెంకన్న, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

### బీఎంఎస్‌తోనే సీఎంపీఎఫ్ సమస్యల పరిష్కారం

ఇల్లెందు: సింగరేణి కార్మికుల సీఎంపీఎఫ్ సమస్యలు బీఎంఎస్‌తోటే పరిష్కారం లభిస్తుందని ఆ సంఘం ఇల్లెందు బ్రాంచి ఉపాధ్యక్షుడు నాయిని సైదులు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల ఢిల్లీలో జరిగిన సీఎంపీఎఫ్ ట్రస్ట్ బోర్డు సభ్యులు 180వ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారని తెలిపారు. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారని, కనీస పెన్షన్ రూ.1000 త్వరలో అమలు చేస్తారని పేర్కొన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ సీఎంపీఎఫ్ కేసులను పరిష్కరిస్తారని, చెల్లింపులకు చర్యలు తీసుకుంటారని చెప్పారు. పీఎఫ్, పెన్షన్ చట్టాన్ని సవరించడానికి ఒక కమిటీ ఏర్పాటు చేసి కొత్త చట్టం చేయబోతున్నట్లు తెలిపారు.

### 'నారాయణ'లో కిడ్స్ మాస్టర్ చెఫ్

పాల్వంచ: నెహ్రూనగర్‌లోని నారాయణ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో శనివారం నిర్వహించిన మాస్టర్ చెఫ్ కార్యక్రమం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాన్ని ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను తిలకించారు. మాట్లాడుతూ... చిన్నారులకు రుచికరమైన వంటలు చేస్తే వారు ఇష్టంగా తింటారని, ఎదిగే పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలన్నారు. స్టాల్స్ బాగున్నాయని అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వూరేటి నరసింహారావు, కిడ్స్ వైస్ ప్రిన్సిపాల్ ఎం.పద్మ, ఏడీ రామకృష్ణ, యు.ఆవని, మాధవి, శ్రావణి, అనూష, పూర్ణిమ పాల్గొన్నారు.

### సబ్ కమిటీ ఏర్పాటుపై హర్షం

టేకులపల్లి: 317 జీఓపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సబ్ కమిటీ ఏర్పాటు చేయడం హర్షణీయమని 317 జీఓ బాధితురాలు, 317 జీఓ సంఘం జిల్లా అధ్యక్షురాలు ద్రౌపది శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. రెండున్నరేళ్ల నరక యాతన అనుభవిస్తూ గత ప్రభుత్వ హయాంలో ఈ జీఓ శాపంగా మారిందన్నారు. అన్ని శాఖల్లో పని చేస్తున్న బాధితులను వారి స్థానికత ఆధారంగా జిల్లాలు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# నిరుపయోగంగా బస్‌షెల్టర్లు

- షెల్టర్లు ఒక్కచోట.. బస్టాప్ మరోచోట
- ప్రయాణికులకు నీడనివ్వని ఆధునిక బస్‌షెల్టర్లు
- ఇల్లెందులో ఏదైనా ఆరంభ శూరత్వమే..


బుగ్గవాగు వద్ద నిర్మించిన మోడ్రన్ బస్టాప్

ఇల్లెందు: ఇల్లెందు పట్టణంలో మోడ్రన్ బస్ షెల్టర్లు ప్రయాణికులకు నిలవ నీడనివ్వడం లేదు. రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఈ షెల్టర్లు శిలావిగ్రహంలా మిగిలాయి.

ఆఘమేఘాల మీద నిర్మాణం చేసిన ఈ బస్‌షెల్టర్‌లు ఉపయోగంలోకి రాలేదు. ఆయా పరిధిలో ఆర్టీసీ బస్సులను నిలపడం లేదు. దీంతో ప్రయాణికులూ అక్కడి రావడం లేదు. ఒకవేళ వచ్చినా ఎండకు ఎండి, వానకు తడిచిపోతున్నారు. ఇవి నిర్మించిందే ప్రయాణికులు ఎండకు ఎండకుండా, వానకు తడువకుండా కానీ ఆచరణలో అది సాధ్యం కావడం లేదు.

**ప్రయాణికులకు ఉపయోగపడని బస్‌షెల్టర్లు..**

ఇల్లెందు పట్టణంలోని ప్రధాన కూడళ్లల్లో ప్రయాణికులు బస్సుల కోసం ఎండకు ఎండి, వానకు తడుస్తూ వేచిచూస్తున్న పరిస్థితి. ఇక మీదట ఎండకు ఎండాల్సిన అవసరం గానీ వానకు తడువాల్సిన దుస్థితి గానీ ఉండదని అంతా అన్నారు. కలెక్టర్ ప్రియాంక ఆదేశాల మేరకు పట్టణంలో ప్రధాన కూడళ్లల్లో ఎనిమిది బస్ షెల్టర్లను గత సెప్టెంబర్ ఏర్పాటు చేశారు. వారంలోపు పట్టణంలోని ప్రధాన కూడళ్లలో బస్ షెల్టర్‌లు దర్శనం ఇవ్వబోతున్నట్లు ప్రకటించారు. కానీ నెలలు గడుస్తున్నా ప్రారంభించారు కానీ అసంపూర్తిగా వదిలేశారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. రాజకీయం మారింది. ఈ నియోజకవర్గ ఎమ్మెల్యే కూడా మారిపోయారు. అభివృద్ధి పనులు కూడా అలాగే మారిపోయి, ముందుకు జరగక ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంది.

**ఏర్పాటు చేసిన ప్రదేశాలు...**

పట్టణంలోని కరెంట్ ఆఫీస్ వద్ద అటు కొత్తగూడెం వెళ్లే ప్రయాణికులు వేచి ఉండే స్థలంలో ఒక షెల్టర్ నిర్మాణం, ఖమ్మం వెళ్లే చోట ప్రయాణికులు వేచి ఉండే స్థలంలో ఒక చోట బస్ షెల్టర్ నిర్మాణం చేశారు. ఇక జేకే బస్ స్టాప్‌లో ఒక షెల్టర్ నిర్మాణం, ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఒక షెల్టర్ నిర్మాణం ప్రారంభించి అసంపూర్తిగా వదిలేశారు. బుగ్గవాగు సెంటర్‌లో ఒక షెల్టర్, గోవింద్ సెంటర్‌లో మహబూబాబాద్ వెళ్లే ప్రయాణికుల కోసం ఒక షెల్టర్, రేల్వే లైన్ దాటిన తర్వాత మహబూబాబాద్ వెళ్లే ప్రయాణికుల కోసం ఒక షెల్టర్, కోర్టు వద్ద గుండాల రోడ్‌లో షెల్టర్ నిర్మాణం చేశారు.

**రూ.24 లక్షలు వృథా..?**

పట్టణంలోని ప్రధాన కూడళ్లల్లో బస్ షెల్టర్ల నిర్మాణం కోసం రూ. 24 లక్షలు వెచ్చించారు. ఒక్కో షెల్టర్‌కు రూ.3.50 లక్షల నుంచి రూ.4 లక్షల వ్యయంతో చేపట్టారు. సీఎంఆర్ సంస్థ తన కంపెనీ యాడ్స్‌ను ఈ బస్‌షెల్టర్‌లకు ఉపయోగించుకునేలా ఆ సంస్థతో నిర్మాణ ఒప్పందం చేసుకుంది అప్పటి ప్రభుత్వం... సెప్టెంబర్, అక్టోబర్‌లో పూర్తి చేసి మున్సిపాలిటీకి అప్పగించాల్సి ఉండగా ఈ నాటికీ పూర్తి చేయలేదు. మున్సిపాలిటీకి అప్పగించలేదు. దీంతో వాటి పర్యవేక్షణ గాలికి వదిలేశారు.


ప్రభుత్వ ఆస్పత్రి వద్ద బస్ షెల్టర్

**షెల్టర్ ఇక్కడ – బస్‌లు అక్కడ..**

పట్టణంలోని ప్రధాన కూడళ్లల్లో ఎనిమిది బస్ షెల్టర్లు ఏర్పాటు చేశారు. కానీ అసంపూర్తి నిర్మాణం వల్ల ఈ షెల్టర్ల వద్ద బస్సులు ఆగటం లేదు. ప్రయాణికులు మాత్రం యథాతదంగా ఎండలో ఎండుతూ వానకు తడుస్తూ బస్‌ల కోసం వేచి చూస్తున్నారు. రూ.లక్షలు ఖర్చు చేసి ప్రయాణికులకు ఉపయోగపడకపోతే ఎలా అని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఉపయోగం లేని బస్ షెల్టర్లు..**


ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన బస్ షెల్టర్లు అసంపూర్తిగా ఉండటం వల్ల నిరుపయోగంగా మారాయి. ప్రయాణికులు కూర్చునేందుకు సీటింగ్ నిర్మాణంతో పాటు ఎండకు ఎండకుండా, వానకు తడవకుంగా షెల్టర్ల నిర్మాణాన్ని డిజైన్ చేశారు. అందుబాటులోకి వస్తే ఉపయోగంగా ఉంటాయి.
– నర్సింహారావు, సుభాష్‌నగర్, ఇల్లెందు

**వెలవెలబోతున్న బస్టాప్‌లు..**


పలు ప్రధాన కూడళ్లల్లో ఏర్పాటు చేసిన బస్ షెల్టర్లు ప్రయాణికులకు ఉపయోగపడక వెలవెలబోతున్నాయి. మోడ్రన్ బస్ షెల్టర్ల నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. వాటి వద్ద బస్‌లు ఆగటం లేదు. దీంతో అక్కడికి ప్రయాణికులు రావటం లేదు. రూ.లక్షలు ఖర్చు చేసినా నిరుపయోగంగా ఉన్నాయి.
– రమేష్, ఇల్లెందు

**వారంలో పూర్తవుతాయి..**


అసంపూర్తిగా ఉన్న మోడ్రన్ బస్ షెల్టర్లు వచ్చే వారం, పది రోజుల్లో అందుబాటులోకి తెస్తాం. కాంట్రాక్టర్‌తో చర్చించాము. ఎమ్మెల్యే సహకారంతో బస్ షెల్టర్ల నిర్మాణం పూర్తి చేసి ప్రజలు ఉపయోగించుకునేలా 10 రోజుల్లో పూర్తి చేసి బల్లలు ఏర్పాటు చేసి బస్‌లు నిలిచేలా ఏర్పాట్లు చేస్తాము.
– డి.వెంకటేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్

## పల్స్ పోలియోను విజయవంతం చేయాలి


పల్స్‌పోలియోపై అధికారుల సమావేశం

పాల్వంచరూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం పల్స్‌పోలియో కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మడవి సరస్వతి, ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడారు. మార్చి 3,4,5 వ తేదీల్లో నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జీరో నుంచి 5 సంవత్సరాల వయస్సు ఉన్న చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలన్నారు. ఉల్వనూరు, జగన్నాథపురం, పట్టణ పరిధిలోని శేఖరంబంజర, గుడిపాడు పీహెచ్‌సీల పరిధిలో మొత్తం 86 పల్స్ పోలియో కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తహసీల్దార్ వివేక్, ఎంఈఓ శ్రీరామ్మూర్తి, మున్సిపల్ శానిటరి ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌రావు, సీడీపీఓ కనకదుర్గ, జగన్నాథపురం, ఉల్వనూరు పీహెచ్‌సీ డాకర్లు రాజు, తేజశ్రీ, గుడిపాడు, శేఖరం బంజర మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

## ఎన్నికల హామీలు అమలు చేయండి..



మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఇల్లెందు: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్ షిప్ విడుదల చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. శనివారం ఇల్లెందులో ఇఫ్టూ కార్యాలయంలో జరిగిన విద్యార్థి సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో మూడు పీడీఎస్‌యూ సంఘాల నేతలు ఇ.రాజేష్, ఏ.సాంబ, కాంపాటి పృథ్వీ, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు బయ్యా అభిమన్యులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలలో భాగంగా ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని, నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని, ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేయాలని, ప్రైవేట్ విద్యాసంస్థలను రద్దు చేయాలని, నూతన భావాలతో కూడిన సిలబస్ ప్రవేశపెట్టాలని కోరారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. పీడీఎస్‌యూ జిల్లా నాయకులు శ్యామ్, గణేష్, పార్థసారథి, విక్రమ్ పాల్గొన్నారు.

## యూఆర్‌ఎస్‌లో దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంఅర్బన్: పట్టణ పరిధి పాతకొత్తగూడెం జెడ్పీహెచ్‌ఎస్ ఆనందఖని పాఠశాల ఆవరణలోని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల (హాస్టల్)లో తాత్కాలిక పద్ధతిలో ఖాళీల భర్తీకి అర్హులు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి బానోత్ జుంకీలాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. యూఆర్‌ఎస్‌లో వంటమనిషి-1, అటెండర్-1 వాచ్‌మెన్-2, అసిస్టెంట్ కుక్-1, క్లీనింగ్ - 1 ఆసక్తి గల యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుదారులు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, వంద మంది విద్యార్థులకు వంట చేసే అనుభవం ఉండి, కొత్తగూడెం నివాసి అయి ఉండాలన్నారు.

ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు వారి బయోడేటాతో పాటుగా ధృవీకరణ పత్రాల జీరాక్స్‌లతో దరఖాస్తులు చేసుకోవాలని, సంబంధిత పత్రాలను అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల పాత కొత్తగూడెంలో అందజేయాలని తెలిపారు.

## మేరీమాత మందిర వార్షికోత్సవం


ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న మత గురువులు


హాజరైన భక్తులు

టేకులపల్లి: సులానగర్‌లోని ఆర్సీఎం చర్చి వద్ద నిర్మించిన మేరీమాత మందిరం ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. చర్చి ఫాదర్ తుంపాటి అగస్టీన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సంబరాల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి వచ్చిన 20 మంది ప్రముఖ మత గురువులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గ్రామానికి చెందిన యువకుల కోలాట నృత్యం ఆకట్టుకుంది. అనంతరం గురువులను ఆర్సీఎం సంఘం సభ్యులు శాలువాలతో సన్మానించారు. సంఘ పెద్దలు, ఉపదేశకులు, యువకులు, కోయగూడెం, మాలపల్లి, సులానగర్ గ్రామాల ప్రజలు హాజరయ్యారు.

## నేడు రావులపాడుకు డిప్యూటీ సీఎం


ఏర్పాట్లపై ఆరా తీస్తున్న సీఐ, ఎస్‌ఐ

టేకులపల్లి: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదివారం టేకులపల్లి మండలం కోయగూడెం పంచాయతీ పరిధి రావులపాడు గ్రామానికి రానున్నారు. కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఏలూరి కోటేశ్వరరావు కుమారుడైన ఆదిత్య వివాహ రిసెప్షన్ జరగనుండగా, డిప్యూటీ సీఎం పాల్గొంటారు. ఈ నేపథ్యాన భద్రతా ఏర్పాట్లను శనివారం సీఐ కరుణాకర్, ఎస్‌ఐ షేక్ సైదా రహూఫ్ పరిశీలించారు.

## విజయ సంకల్ప యాత్రను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న పానిశెట్టి వెంకటేశ్వర్లు

పాల్వంచరూరల్: భద్రాచలం నుంచి సారపాక మీదుగా పాల్వంచ వరకు నేడు ఆదివారం జరగనున్న విజయ సంకల్ప యాత్రలో బీజేపీ శ్రేణులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పానిశెట్టి వెంకటేశ్వర్లు కోరారు. స్థానిక శ్రీనగర్ కాలనీలో శనివారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. తొమ్మిదేళ్లలో ప్రధాని నరేంద్రమోదీ భారతదేశాన్ని అత్యంత శక్తివంతంగా చేసినట్లు చెప్పారు. సమావేశంలో రాపాక రమేష్, గంధంప్రసాద్, రంజిత్, నరేష్ పాల్గొన్నారు.

## 28న మండల స్థాయి సైన్స్ ఫేర్

జూలూరుపాడు: 28న స్థానిక సాయి ఎక్స్‌లెంట్ స్కూల్‌లో మండల స్థాయి సైన్స్ ఫేర్ నిర్వహిస్తున్నట్లు స్కూల్ ఎకనామిక్ డైరెక్టర్ మోహన్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ... సర్ సీవీ రామన్ జయంతి సందర్భంగా మండల స్థాయి సైన్స్‌ఫేర్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సైన్స్ ఫేర్‌లో పాల్గొనే విద్యార్థులు ఈనెల 27వ తేదీ లోపు సాయి ఎక్స్‌లెంట్ స్కూల్‌లో తమ పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డి.తిరుపతిరావు, ఎ.మణిదీప్, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా తిరుకల్యాణ మహోత్సవం


పూజలో పాల్గొన్న కొత్వాల దంపతులు

పాల్వంచ: స్థానిక పాత పాల్వంచలోని శ్రీ అలివేలు మంగా పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం స్వామి తిరుకల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రధాన పూజారి కందాల ఆనందకుమారాచార్యులు ఆధ్వర్యంలో గత గురువారం నుంచి వార్షిక బ్రహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మూడోరోజు స్వామి వారి కల్యాణం, సుప్రభాతం, ఆరాధన, చతుస్థానార్చన, ఆవహిత దేవత హోమం, అన్నదానం, స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు. డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, విమలాదేవి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎన్.రజనీకుమారి, నిర్వాహకులు కొత్వాల సత్యనారాయణ, కిలారు సుజాత, పుప్పాల వెంకటేశ్వర్లు, మోరా లక్ష్మీరాజు, హరిత్య నారాయణ, గంధమల్ల రాజయ్య, లోగాని రాంబాబు, సుబ్రహ్మణ్యం, ముత్యాల కోటేశ్వరరావు, నాసరయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ప్రణాళికతో చదువుకోవాలి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వై.చిన్నప్పయ్య

పాల్వంచరూరల్: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ప్రణాళిక ప్రకారం చదువుకుంటే విజయం వరిస్తుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.చిన్నప్పయ్య అన్నారు. లక్ష్మీదేవిపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల (సీఓఈ) కళాశాలలో శనివారం పది, ఇంటర్ విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు దేశభక్తి, సినిమా గీతాలకు నృత్యాలు చేసి అలరించారు. అనంతరం ముఖ్యఅతిథిగా హాజరైన ప్రిన్సిపాల్ మాట్లాడారు. విద్యార్థుల ఆలోచనలు తప్పుదోవ పట్టకుండా చదువులపై దృష్టి సారిస్తే లక్ష్యానికి చేరుకుంటారన్నారు. పెడదారి పడితే జీవితం అగమ్యగోచరంగా తయారవుతుందన్నారు. అధ్యాపకులు సైతం తమ చిన్ననాటి అనుభవాలను పిల్లలకు వివరించి చదువుకునే రోజుల్లో కష్టపడి చదువుకుని ఎలా జీవితంలో స్థిరపడ్డారో వివరించాలన్నారు. కార్యక్రమంలో సీఈఓ ప్రధాన చార్యులు డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.కృష్ణ, పుల్లారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## సమష్టి కృషితోనే విజయం సాధ్యం


మాట్లాడుతున్న వీరబాబు

కొత్తగూడెంఅర్బన్: క్రికెట్ పోటీల్లో 11 మంది సభ్యులు సమష్టి కృషితో ఆడినప్పుడే అవతల జట్టును ఓడించగలుగుతారని సీనియర్ క్రికెట్ క్రీడాకారుడు వీరబాబు అన్నారు. సాధన మైదానంలో రాజేందర్ సేవా సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రవీణ్ మెమోరియల్ క్రికెట్ పోటీలకు శుక్రవారం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. మాట్లాడుతూ... ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతిభకు సముచిత స్థానం ఉందని, ప్రతిభ ఉన్న వారికి అవకాశాలు వస్తున్నాయని చెప్పారు. క్రీడల్లో రాణించాలంటే నిరంతర సాధన అవసరమని యువకులు కఠోర సాధన చేయడంతో పాటు సంప్రదాయ క్రికెట్ ఆడుతూనే మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్తగా వచ్చిన మార్పులను సైతం అవగాహన చేసుకుని ముందుకు సాగాలన్నారు. ఏ జట్టు విజయం సాధించినా క్రికెట్‌దే విజయంగా ఉండాలని సూచించారు. ఎలాంటి రాగాద్వేషాలు లేకుండా క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. రాజేందర్ సేవా సంస్థ అధ్యక్షుడు యర్రా కామేష్, 5వ వార్డు కౌన్సిలర్ అనిల్, రమేష్, విజయ్ భాస్కర్ పాల్గొన్నారు.

## పంటలకు గిట్టుబాటు ధర కల్పించండి


కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఐ, రైతు సంఘం నాయకులు


జూలూరుపాడు: పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని శాంతియుతంగా ఆందోళన నిర్వహిస్తున్న రైతులపై కాల్పులు జరపడాన్ని నిరసిస్తూ సీపీఐ, తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం జూలూరుపాడులో ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించి, కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... రైతులపై కాల్పులు జరిపిన బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని పిలుపునిచ్చారు. ఢిల్లీ సరిహద్దులోని హర్యానా ప్రాంతంలో కేంద్ర బలగాలు రైతులపై జరిపిన కాల్పుల్లో శుభకరన్ సింగ్ మృతి చెందడంతోపాటు, పలువురు రైతులు గాయపడినట్లు చెప్పారు. రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో ప్రజలు తగిన విధంగా బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చింతా స్వరాజ్‌రావు, మండల కార్యదర్శి యాసా రోశయ్య, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్కే నాగుల్‌మీరా, గార్లపాటి వీరభద్రం, ఎస్కే చాంద్‌పాషా, నిమ్మటూరి లక్ష్మయ్య, కిలారి నరేష్, వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య, నరసింహారావు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## రైతులపై కాల్పులు అమానుషం


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

సింగరేణి(కొత్తగూడెం): కనీస మద్దతు ధర, రైతుల ఇతర డిమాండ్ల సాధనకై ఆందోళన చేస్తున్న రైతులపై కేంద్ర ప్రభుత్వం కాల్పులు జరుపటం అమానుషమని ఐఎఫ్‌టీయూ నాయకులు అన్నారు. సమస్యల సాధన కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రైతులపై జరిపిన కాల్పులను ఖండిస్తూ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కొత్తగూడెంలోని రైటర్ బస్తీ, బస్టాండ్ సెంటర్లలో నిరసన, కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను శనివారం దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, కార్మికుల హక్కులను దెబ్బతీసే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మూడు రోజుల క్రితం పంజాబ్, హర్యానా సరిహద్దుల్లోని ఖనౌరీ వద్ద కనీస మద్దతులపై ఆందోళన చేసుతన్న రైతులపై కాల్పులు జరపటానికి తీవ్రంగా ఖండించారు. ఇది ఆర్‌ఎస్‌ఎస్, మోదీల ప్రజా వ్యతిరేకతను, జాతీయ వ్యతిరేకతను మరోసారి చూపిస్తోందన్నారు. చికాగో అమరవీరుల సాక్షిగా సాధించుకున్న కార్మిక హక్కులను నరేంద్ర మోదీ ప్రభుత్వం తుంగలో తొక్కిందన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ఎల్.విశ్వనాథం, గౌని నాగేశ్వరరావు, మోతుక్కరి మల్లికార్జున్‌రావు, సంజీవరావు, అంజయ్య, రాము, ప్రసాద్, కృష్ణ, కాలేష్, రాజన్న, చలపతి తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన వనదేవతల జాతర


గద్దెల వద్ద పూజ చేస్తున్న ఎమ్మెల్యే కనకయ్య


పూజ చేస్తున్న ప్రధాన పూజారులు

ఇల్లెందురూరల్: మూడు రోజులపాటు గద్దెలపై కొలువుదీరిన వన దేవతలు సమ్మక్క, సారలమ్మ భక్తుల నుంచి విశేష పూజలతోపాటు నైవేద్యాలు అందుకొని శనివారం సాయంత్రం వనంలోకి ప్రవేశించారు. అంతకు ముందు వనప్రవేశం రోజు కావడంతో భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకొని చల్లంగచూడాలని వేడుకున్నారు. మండలంలోని బొజ్జాయిగూడెం గ్రామంలో అమ్మవార్ల వనప్రవేశ కార్యక్రమాన్ని ప్రధాన పూజారులు, భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేసి సంప్రదాయబద్ధంగా సాగనంపారు. ప్రధాన పూజారికి అమ్మవారు ఆవహించడంతో ఆమె పలుకులను భక్తులు ఆలకించారు. అమ్మవార్లు వన ప్రవేశ సమయంలో భక్తుల రద్దీతో ప్రధాన రహదారిపై సుమారు గంటపాటు రాకపోకలు నిలిచిపోయాయి. బొజ్జాయిగూడెం సమ్మక్క, సారలమ్మ గద్దెలను శనివారం ఎమ్మెల్యే కోరం కనకయ్య సందర్శించారు. ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యంగా బంగారం (బెల్లం) సమర్పించారు. ఆయన వెంట ఎంపీపీ చీమల నాగరత్నమ్మ, జాని, మెట్టెల కృష్ణ, చీమల వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.